# స్వస్వరూప సందర్శన భాగ్యమే జ్ఞానము

శాంతి అంతరించె సత్యంబు కరువయ్యె
ఆయుధముల ధాటి అధికమయ్యె
ఈ దురంతములకు హేతువు స్వార్థమె
సత్యమైన బాట సాయి మాట.

జాతి గౌరవంబు నీతిపై నిలచును
నీతిలేకయున్న జాతి చెడును
నీతి కల్గు జాతి నిజమైన జాతిరా
వినుడు భారతీయ వీరసుతుడ!

ప్రేమస్వరూపులారా!

మానవజాతి గౌరవ, మర్యాదలు నీతి నిజాయితీలతోకూడిన మానవత్వము పైననే ఆధారపడివున్నవి. మానవజాతియొక్క సంస్కృతి పురాతనమైనటువంటిది. భారతీయ సంస్కృతియొక్క ప్రధాన లక్ష్యము 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ', అను సూక్తిపై ఆధారపడి వున్నది. మీరందరూ కూడను దైవ సమానులే! దీనిని గౌరవించి వీరందరికి తగిన కృతజ్ఞతలందించినవాడు మాత్రమే మానవుడు. కృతజ్ఞత లేని మానవుడు మానవుడే కాడు. అనాది కాలమునుండి భారతీయ సంస్కృతి పరదేశములకు దివ్యమైన ఆధ్యాత్మిక ఆచార, ప్రబోధములను చేసిన దివ్య సంస్కృతి.

**అనేకత్వములోని ఏకత్వమును గుర్తింప జేయునదే భారతీయ సంస్కృతి**

భారతీయ సంస్కృతి మానవుడు చేయు ప్రతి కర్మకుకూడా ప్రతిచర్య అనేది వున్నది అనే విషయమును బోధిస్తూ వస్తున్నది. కనుక, మానవుడు మంచి కర్మలాచరించి, మంచి

sri sathyasai vachanamrutam

భావములను అభివృద్ధిపరచుకుని, మంచి జీవితాన్ని గడపటానికి తగిన కృషి చేయాలి. సంస్కృతి అనగా కేవలం ఒక మతము కాదు. ఇది ఒక సాంప్రదాయము కాదు. ఇది కేవలం నాగరికత కాదు. ఇది వేషభాషలకు సంబంధించినది కాదు. అనాది కాలమునుండి అనంతమై, నిత్యమై, ప్రవహించే జాతీయ జీవన స్రవంతి. అనేకత్వములోని ఏకత్వాన్ని గుర్తింపచేయునదే భారతీయ సంస్కృతి. నీతి, నిజాయతీలతో కూడిన నడవడికయే యీ భారతీయ సంస్కృతి. విచక్షణా జ్ఞానం కలిగి, గౌరవ మర్యాదలతో జీవింపచేయునదే భారతీయ సంస్కృతి. దివ్యత్వమైన పవిత్రమును సమీపింపచేయునదే సంస్కృతి. సంస్కరింప చేసినటువంటిదే సంస్కృతి. ఇట్టి దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన భారతీయ సంస్కృతిని నేడు భారతీయులు విస్మరించి కేవలం అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన ప్రకృతిని విశ్వసిస్తున్నారు.

### సర్వ మానవ సౌభ్రాతృత్వముకంటె సర్వాత్మ భావము ఉత్కృష్టమైనది

భారతీయులకు ప్రపంచములోని సమస్త పదార్థములుకూడా పూజనీయములే! రాయిమొదలు రత్నమువరకు, పచ్చికమొదలు పారిజాతమువరకు, చీమమొదలు సింహమువరకు, చెట్టు, పుట్ట, గుట్ట, మట్టినికూడా పూజించేటువంటిది, భారతీయ సంస్కృతి. కాని, యిందలి అంతరార్థమును గుర్తించలేని మూఢులు, భారతీయులు కేవలం మూఢవిశ్వాసం కలవారు, మూర్ఖులు అని హేళన చేస్తున్నారు. ఈ సత్యాన్ని యితరులు ఏమాత్రం లోతునకు దిగి తెల్సుకోవటానికి ప్రయత్నించటంలేదు. దివ్యమైన పరమాత్మ ప్రేమను మానవులవరకే పరిమితం కాకుండా సమస్త చరాచర ప్రపంచమునకు వ్యాపింప చేయటానికి యీ విధమైన సంస్కృతిని నిర్ణయించింది. 'సర్వం ఖల్విదం బ్రహ్మ', 'ఈశావాస్య మిదం సర్వం', 'ఈశ్వర స్సర్వభూతానాం' యిట్టి పవిత్రమైన సూక్తులన్నీకూడా ప్రతీ ప్రాణియందు దివ్యత్వాన్ని, పవిత్రతను గుర్తింపచేసే భావనలే! సర్వ జీవులందు ఈశ్వరత్వం గలదనియు, ప్రకృతి అంతయు పరమాత్మ స్వరూపమని, భారతీయ సంస్కృతి చాటుతూ వచ్చింది. సర్వ భూతముల ఏకత్వమును భిన్నత్వము కానివ్వకుండా దైవత్వంగా మార్చ

srisathyasaivacharamrutam

గల్గినది, యీ సంస్కృతి. సర్వభ్రాతృత్వముకంటే సర్వాత్మ భావము అత్యున్నతమైనదని చాటినది, భారతీయ సంస్కృతి. సమత, సమగ్రత, సమైక్యత, సౌభ్రాతృత్వము యీ నాల్గింటియొక్క అంతర్వాణియే భారతీయ సంస్కృతి. కనుక, సౌభ్రాతృత్వముకంటే సర్వాత్మభావము అత్యున్నతమైనది, అత్యధికమైనది. ఇట్టి విశాలమైన భావము ఏ మతమునందుకాని, ఏ దేశమునందుకాని, ఏ కాలమునందుకాని కానరాదు.

**విశ్వం విష్ణుస్వరూపమనే విశాల భావమును ప్రపంచానికి చాటినది, భారతదేశము**

ఇట్టి జాతీయతా భావమును భారతీయులు మాత్రమే ప్రాచీనకాలమునుండి అనుభవిస్తూ, ఆచరిస్తూ, ప్రచార ప్రబోధములు సల్పుతూ వచ్చారు. దీనినే భారతీయులు ఒక ఆధ్యాత్మిక సంస్థగా రూపొందింపచేసుకుంటూ వచ్చారు. ఈయొక్క ఫిలాసఫీకి సంబంధించిన తత్త్వము మరి ఏ దేశమునందుకాని, మరే మతమునందుకాని కానరాదు. సమస్త ప్రాణులను ప్రేమించటమనేది మూర్ఖత్వమా? సర్వ జీవులను సమానంగా ప్రేమించేది మూర్ఖత్వమా? నిజముగా యీ సత్యాన్ని గుర్తించలేనివారే మూర్ఖులు కాని, భారతీయులు మూర్ఖులు కాదు. భారతీయులు మూర్ఖ విశ్వాసంతో, మూఢ విశ్వాసంతో పూజించటం కాదు. 'విశ్వం విష్ణుస్వరూపం' అనే విశాలభావాన్ని అభివృద్ధిపరచి, యితర దేశములకుకూడా ప్రచార ప్రబోధములు సల్పి, సుస్థిరమైన శాంతిభద్రతలను చేకూర్చినది భారతదేశము.

భారతీయులలోకూడా కొందరు మూర్ఖులు యీ సత్యాన్ని గుర్తించలేక దీనికి పెడర్థములు కల్పించి, అనర్థములుగా విశ్వసించి ప్రచార ప్రబోధలు సల్పుతూ వచ్చారు. ప్రతీ భారతీయుడుకూడను మన పవిత్రమైన సంస్కృతికి వారసుడే! ప్రతీ భారతీయునికికూడా యీ పవిత్రమైన సంస్కృతిని తు.చ. తప్పక అనుసరించి, ఆచరించి, ఆనందించే హక్కు వుంది. కాని, యీనాడు అట్టి విశాలమైన భావములు విస్మరించారు. సంకుచితమైన భావములను అభివృద్ధి గావించుకుంటూ వచ్చారు. ఇది కేవలం స్వార్థము, స్వప్రయోజనములయొక్క చిహ్నమే! యీనాటి మానవుడు స్వార్థము, స్వప్రయోజనములకై పాటుపడుతున్నాడు. విశాలమైన సమాజతత్త్వమునకుకాని,

srisathyasaivachanamrutam

విశాలమైన భారతీయ సంస్కృతియొక్క తత్త్వమునకు కాని ఏమాత్రం ప్రయత్నించటం లేదు. కనుక, భారతీయ సంస్కృతిని ప్రతీ మానవుడు అర్థం చేసుకుని తనయొక్క అజ్ఞానం దూరంగావించుకొనుటకు పూనుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

**మానవుడు తన కర్తవ్యాన్ని గుర్తించక పూర్వమే కాయమును వదులుతున్నాడు**

'తమసోమా జ్యోతిర్గమయా' అన్నారు. అజ్ఞానమును దూరం గావించుకునే నిమిత్తమై, మానవత్వమనేదానిని దివ్యత్వంగా మార్చుకునే నిమిత్తమై, పవిత్రమైన భారతీయ సంస్కృతీ చరిత్రలను సార్థకం గావించుకునే నిమిత్తమై మానవత్వం ఏర్పడినది కాని, ఆకలి, దప్పి, నిద్రలతో కాలం వ్యర్థం గావించుకునే నిమిత్తమై మానవత్వం మనకు సంప్రాప్తం కాలేదు. ఈ సత్యాన్ని గుర్తించుకోలేక పోతున్నారు, నేటి భారతీయులు. కాలము ప్రచండవేగంతో కరిగిపోతున్నది. కాయమునకు కేటాయించిన ఆయుఃప్రమాణం మంచుగడ్డవలె క్షణక్షణమునకు కరిగిపోతున్నది. అయితే, మానవుడు కర్తవ్యాన్ని గుర్తించక పూర్వమే కాయమును విసర్జిస్తున్నాడు. ఇదేనా మానవునియొక్క లక్ష్యము? ఇదేనా మానవునియొక్క కర్తవ్యము? 'జంతూనాం నరజన్మ దుర్లభం'-అనే దాని అంతరార్థం యిదేనా? మానవుడనుభవించే ఆహార, నిద్ర, భయాదులు పశుపక్ష్యాదులుకూడా అనుభవించటం లేదా? ఈ సర్వ జీవులందు మానవుడే ఉత్తముడు అనే దాని అంతరార్థం ఏమిటి? మానవత్వాన్ని గుర్తించాలి. మానవత్వమనగా ఏమిటి? మనస్సు, మాట, క్రియ ఒక్కటి కావాలి. అట్టి ఏకత్వమే మానవత్వములో లేకపోతే వాడు మానవుడే కాదు. కనుక, మానవత్వంలో వుండే అంతరార్థాన్ని ప్రతీ వ్యక్తికూడా గుర్తించి వర్తించాలి. భారతీయ సంస్కృతియొక్క ప్రభావమును నేడు భారతీయులే గుర్తించుకోలేకపోతున్నారు. అలాంటి పరిస్థితిలో మానవునియొక్క జీవితమంటే ఏమిటో వారికి అర్థం అవుతుందా? ధనకనకవస్తువాహనాదులు మానవత్వాన్ని ఏమాత్రం రక్షించవు. ఇవన్నీ కదిలిపోయే మేఘములేకాని, స్థిరమైన సత్యస్వరూపములు కావు. మన జీవితం క్రమక్రమేణా దివ్యత్వానికి సమీపించాలి. వెలుతురు మనను సమీపించుకొలదీ మనకు చీకటి దూరమవుతుంది. చీకటి దూరం కావటమే గాకుండా ఆ

srisathyasaivachanamrutam

వెలుతురుయొక్క వేడిని మనం అనుభవిస్తున్నాము.

మనం దివ్యత్వానికి సమీపంగా ప్రవేశించాలి. అప్పుడే మనయందున్న అజ్ఞానమనే చీకటి దూరమైపోయి దివ్యత్వమనే ఆనందాన్ని మనం అనుభవించగలము. ఇట్టి దివ్యత్వమనేది మానవునియందే వుంటున్నది. మనం మరొక చోటుకు పోయి వెతకనక్కరలేదు. వెలుగుతున్న దీపాన్ని గుర్తించడానికి మరొక దీపము కావాలా? అవసరంలేదు. మనయందే ఉన్న దివ్యమైన, భవ్యమైన జ్ఞానతత్త్వాన్ని గుర్తించుకోవటానికి మరొక జ్ఞానం మనకవసరంలేదు. స్వస్వరూప సందర్శన భాగ్యమే జ్ఞానం. తన తత్త్వాన్ని తాను గుర్తించుకునే నిమిత్తమయి మానవునికి తనువును అనుగ్రహించాడు, భగవంతుడు. తనను తాను గుర్తించుకునే నిమిత్తమయి యిచ్చిన యీ తనువును కేవలం వ్యర్థం గావించుకుంటున్నాడు, మానవుడు.

**ఈనాడు పశు, పక్ష్యాదులకున్న త్యాగముకూడా మానవునికి లేదు**

ఈనాడు మానవునియందు త్యాగమనేది రూపుమాసిపోయింది. వేదములంతాకూడను 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః' అని ఘోషిస్తున్నాయి. త్యాగంవల్ల ఎంత క్షేమమున్నదో మీరు గుర్తించటానికి ప్రయత్నించాలి. పక్షులుకూడా తమ పిల్లలకు రెక్కలు వచ్చిన తక్షణమే తమ జీవితమును తాము అనుభవించమని పంపుతున్నవి. ఆ పక్షులే త్యాగం చేస్తున్నాయి. పశువులు తమ బిడ్డలకు గడ్డిని తినే శక్తి వచ్చేంతవరకు చెంత చేర్చుకుని పోషిస్తాయి. కాని, తన పొట్టను తాను నింపుకునే స్వశక్తి అభివృద్ధి అయ్యేకొలది బిడ్డలను స్వేచ్ఛగా వదిలిపెడతాయి. యీనాడు పక్షులకైనా త్యాగమున్నది. పశువులకైనా త్యాగమున్నది. కాని, మానవునికి త్యాగంలేదు. చచ్చునంతవరకుకూడను సంబంధము, సంబంధము, సంబంధము. ఈయొక్క సంబంధమును కట్టుకొని అనేక విధములైన బాధలకు గురి అవుతున్నాడు, మానవుడు. ఇట్టి మానవునియొక్క చదువుసంధ్యలు ఏమి ప్రయోజనం? ఇట్టి మానవునికి జ్ఞాన ప్రబోధలంతా ఏమి ప్రయోజనం? ఇట్టి మానవునికి విజ్ఞాన, సుజ్ఞాన, ప్రజ్ఞానములుండి ఏమి ప్రయోజనం? ఉపనిషత్తులు చదివి ఏమి ప్రయోజనం? వేదములనధ్యయనం చేసి ఏమి ప్రయోజనం? కేవలం యివన్నీకూడా ఒక



sri sathyasai vahini vachanamrutam

గ్రామఫోను ప్లేటువలె రూపొందుతూ వస్తున్నాయి. హృదయ పరివర్తన లేక, మానసిక వికాసం లేక, దివ్యత్వముయొక్క భావములేక మానవుడిగా బ్రతికి ప్రయోజనం ఏమిటి? ఇది చాలా అసందర్భమైనటువంటి విషయము. త్యాగానికి పూనుకోవాలి.

**మనస్సు పరివర్తన చెందకుండా బాహ్యమైన కర్మలు ఎన్ని చేసినా ప్రయోజనం లేదు**

ఎంత కాలముండినా దేహాన్ని విసర్జించక తప్పదు. గడచిన దినములే తిరిగి వస్తున్నాయి. గడచిన అనుభూతులే తిరిగి అనుభవిస్తున్నాము. చేసిన పనులే చేస్తున్నాము. కాని దివ్యమైన భావాలు మనలో ఏమాత్రం ఆవిర్భవించటంలేదు. ఎంతమంది గీతలు చదువుతున్నారు? ఎంతమంది ధ్యానము, జపములు చేస్తున్నారు? కాని వీటియొక్క పరిణామం ఏమిటి? దీనియొక్క ఫలితమేమిటి? ఏమాత్రం గుర్తించటంలేదు. కేవలం చేతితో జపమాల త్రిప్పినంత మాత్రమున హృదయం పవిత్రమవుతుందా? మొట్టమొదట మనసును మార్చుకోవాలి.

**కాషాయ వస్త్రంబు కట్టిన మాత్రాన**
**కరతలామలకంబు కాదు భక్తి**
**నోటితో మంత్రంబు నుచ్చరించినయంత**
**చేసిన పాపంబు చెదిరి పోదు**
**గీతను చేబట్టి కేకలు వేసిన**
**పుణ్యము మనయింట ప్రోవు పడదు**
**చెప్పు మాటలకును చేయు పనులకును**
**సామ్యముండెడివాడె సాధువగును**
**అహము పరనిందయను పాడు కుళ్ళు తీసి**
**సర్వ జీవులందు సర్వేశ్వరుండు ఒక్కడే అన్న**
**భావమ్ము మదియందు నిల్పుకున్న**
**ఆనాడె సాధుసంఘంబు అభివృద్ధిగాంచునయ్య.**

అట్టి ఏకత్వం మనలో ప్రాప్తించాలి. మన మనస్సు పరివర్తన కాకుండా బాహ్యమైన కర్మలు



srisathyasaivachanamrutam

ఎన్ని చేసినప్పటికిని ప్రయోజనం లేదు. ధర్మక్షేత్రము ప్రారంభించి యిరువదిఐదు సంవత్సరములైనది. 25 సంవత్సరములనుంచి ఎన్ని బోధలో మీరు వింటున్నారు. ఎన్ని సాధనలో మీరు చేస్తున్నారు. కానీ ఎవరికి వారు లోతునకు దిగి విచారిస్తే తమలో కించిత్తైనా మానసిక మార్పులు కలిగినవా? యీ మానసిక మార్పులు మనం గుర్తించటానికి ప్రయత్నించాలి. బాహ్యకర్మలన్నియు ప్రాకృతమైనవి. ప్రవృత్తి సంబంధమైనవి. కానీ, నివృత్తి సంబంధమైన జ్ఞానమును ప్రయత్న పూర్వకముగా సాధించాలి.

ప్రపంచములో మనము చూచేటువంటివి, అనుభవించేటువంటివి, ఆనందించేవి అన్నికూడను అంతర్ముఖమైన ప్రతిబింబములే! Reflection of the inner being. అలాంటి నిత్యమైన సత్యాన్ని మనం యీనాడు గుర్తించుకోలేక పోతున్నాము. ఏమీ ప్రయోజనము లేదు. ఒక్క ఆధ్యాత్మిక మార్గమే మానవునికి ప్రధానమైన దివ్యత్వమును నిరూపిస్తుంది. ఈ ఆధ్యాత్మిక మార్గమే మానవత్వమును ప్రకటింపచేస్తుంది. సత్యమార్గమును ప్రబోధించాలి. సత్యం దైవం. యిట్టి సత్యము నిమిత్తమై మనము ఎన్ని ప్రయత్నములైనా చేయాలి. ఈ సత్యమే సర్వవిధములైన రూపము. సత్యమే భగవంతునియొక్క నివాసము. సత్యమైన, నిస్వార్థమైన జీవితమే సత్య జీవితము. దీనినే 'సత్యస్యసత్యం' అన్నారు. అట్టి సత్యజీవితమును మనం అనుభవించాలి. నిత్య జీవితమును అనుభవించాలి.

**'నేనెవరు?' అనే సత్యాన్ని అన్వేషించాలి**

శాంతి, శాంతి. శాంతి ఎక్కడ వుంది? నీ రూపమే శాంతి. నీ జీవితమే శాంతి. శాంతి నీ దగ్గరనే వుంటున్నది. శాంతి బయట ప్రపంచములో వెదకటానికి ప్రయత్నించటము కేవలము మూర్ఖత్వము. ఒక గదిలో ఒక వ్యక్తి అనేక పదార్థములు చూస్తూ వుంటాడు. ఆ వ్యక్తికి అన్ని పదార్థములు కనబడతాయికానీ ఒక్క పదార్థము అతనికి కనబడదు. ఏమిటది? వెతికేటువంటి వాడు అతనికి కనుపించడు. యీనాడు అన్నింటిని వెతుకుతున్నాము. నా శాంతి యేమార్గములో వున్నది, ఏ దేశములో వున్నది, ఏ స్థితిలో వున్నది అని వెతుకుతున్నారే గానీ తనను తాను వెతుక్కోటానికి ప్రయత్నించటంలేదు. తనను తాను



srisathyasaivachanamrutam

వెతుక్కొనక ఎన్ని వెతికి ప్రయోజనం ఏమిటి? 'నేనెవరు' అనే సత్యాన్ని వెతకాలి. This is my body, my bodyK; I am not the body. నేనెవరు? యీ సత్యాన్ని క్రమక్రమేణా విచారణపూర్వకంగా తెలుసుకొనుటకు ప్రయత్నించాలి. ఉపనిషత్తులలో అందుకునేది కాదు. ఉపనిషత్తులు ప్రబోధిస్తూ వచ్చాయి. అంతేకానీ, దానిని అందుకోవటానికి మనం ప్రయాణం సల్పాలి. ఒక గైడు పోస్టు వుంటుంది. 'యిటువైపున పోతే ఫలాని రోడ్డు, యిటువైపున పోతే ఫలాని గ్రామము' అని తెలుపుతుంది. కానీ, ఆ మార్గములో నడచవలసినవారు మనమే-గైడుపోస్టు గైడెన్సు యిస్తుందిగానీ, అది మన గమ్యాన్ని చేర్చదు.

**మన హృదయమును దైవమునకు అంకితము గావించినప్పుడే దివ్యత్వము మనకు గోచరిస్తుంది**

అదే విధముగనే భగవద్గీతగానీ, భారతముగానీ, భాగవతముగానీ, ఉపనిషత్తులుగానీ మనకు మార్గమును బోధిస్తున్నాయిగానీ, నడచవలసినది మనమే! తట్టలో పొటాటో చపాతీ పెట్టినప్పుడు 'పొటాటో, చపాతి' అని ఎన్ని పర్యాయములు వల్లించినా నీ పొట్ట నిండుతుందా? తట్టలో పదార్థము పొట్టలో చేరటానికి నోటికి, చేతికి పని పెట్టాలి. చేతితో తియ్యాలి. నోటిలో పెట్టాలి. భగవత్ కార్యములు చేతితో చెయ్యాలి. భగవంతుని నామాన్ని నోటితో ఉచ్చరించాలి. అంతేగానీ, కేవలం పెదవులతో ఉచ్చరించినంతమాత్రమున చాలదు. మనము ఎన్నో భజనలు చేస్తున్నాము. ఎన్ని వుపన్యాసములో వింటున్నాము. ఎన్నియో పవిత్రమైన విషయాలను వింటున్నాము. కానీ వినే చెవులంతా లౌడు స్పీకర్సువలె వుంటున్నాయి. పాడే పాటలు అంతా మైక్ మాదిరి వినిపిస్తున్నాయి. తాళములంతా శబ్దముమాదిరి వినిపిస్తున్నాయి. అన్నింటియందు మనస్సనే కరెంటు ఏకం కావాలి. కనుకనే 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నారు. మనస్సనేది యీ అంగములలో చేరకుండిన యివన్నియు కేవలం కీ యిచ్చిన గడియారమువలె ఆడుతాయి. భగవంతుని నామమును ఉచ్చరించాలంటే మనస్సును ఏకం చేయాలి. ఒక చిన్న ఉదాహరణము. ఎన్నో ఉపన్యాసములు, ఎన్నో పాటలు, ఎన్నో పద్యములు అంతా టేపు

చేస్తున్నాము, మనము. ఆ టేపులోపల అన్ని శబ్దాలు వుంటున్నాయి. ఆ టేపును ముక్కలు ముక్కలుగా కత్తిరిస్తే ఏమైన శబ్దము వినిపిస్తుందా? లేక భూతద్దాలు పెట్టుకొని చూస్తే ఆ శబ్దాలు కనుపిస్తాయా? కనుపించవు, వినిపించవు. కానీ ఆ టేపు రికార్డులోని కరెంటుకు అతికించినపుడు బాగా పాట పాడుతుంది. అదే రీతిగా మన హృదయమనేది ఒక టేపు. భగవద్వాక్యములంతా టేపు చేసుకుంటున్నాం. చదివిన విషయాలతో టేపు నిండి పోతున్నది. కానీ, ఒక్కటి కనుపించటంలేదు. దివ్యత్వమనే దైవత్వానికి అతికించినప్పుడే టేపు పాడుతుంది, మాట్లాడుతుంది. కనుక, మన హృదయాన్ని, మన మనస్తత్వాన్ని, దైవానికి అంకితము గావించాలి. అప్పుడే దివ్యత్వము మనకు గోచరిస్తుంది. దైవత్వమునకు దూరముగా వుండినంతవరకు మనలో వుండిన దివ్యత్వము మనకు యేమాత్రము అర్థముకాదు. భౌతిక విషయములపైన మనస్సు ప్రసరించినంతకాలము దివ్యత్వము యేమాత్రము అర్థము కాదు.

**దిల్‌మే రామ్, హాత్‌మే కామ్**

నీ యొక్క మనస్తత్వాన్ని నీవు అంతర్ముఖము గావించుకోవాలి. జగత్ సంబంధమైన వ్యాపారమును నీవు గావించుకో! Do your duty, work is worship. నీవు దానిని మానుకోనక్కరలేదు. కానీ, మానసిక తత్త్వాన్ని చక్కగా అర్థము చేసుకో! Hands in the society and head in the forest, that is rest. 'దిల్‌మే రామ్ హాత్‌మే కామ్'. యీ విధమైన చర్యలలో మనం పోవాలి. మనము చేసేది ఆడంబరముగా చేయకూడదు. మన conscience మనకు తృప్తి. ఆత్మ తృప్తి కావాలి. అన్ని మతముల తత్త్వము యీ రీతిగానే వుంటున్నాది. ఏ మతముకానీ హృదయ పరివర్తననే బోధిస్తూ వచ్చింది. సర్వ మతములయొక్క సారము, సర్వ మార్గములయొక్క గమ్యము, సర్వ శాస్త్రములయొక్క సారము హృదయ పరివర్తనే! మనస్సు అనేదానిని వికసింపచేసుకోవాలి. ప్రకాశింపచేసుకోవాలి. దివ్యమైన భగవన్నామాన్ని మన హృదయములో ముద్రించుకోవాలి. ఉద్ధవుడు గోపికల భక్తి, ప్రపత్తులను పరీక్షించే నిమిత్తమై వచ్చాడు. కానీ, వారియొక్క హృదయ పరివర్తన చూచి, తిరిగి వెళ్ళి, యీ సందేశమును కృష్ణుని కందించాడు. ఏమని అందించాడు?

srisathyasaivacharamrutam

**అత్తలు మొత్తుతున్న మరి భర్తలు కత్తులు నూరుచున్న**
**నోరెత్తరు, కోపగించరు, ఎటకేగరు, భీతిలబోరు గోపికల్**
**పొత్తములందు చిత్తరువురీతిగనుండెను కృష్ణుడు వారిలో!**

మనస్సు యేమాత్రం మార్చుకోలేదు. కత్తులు చూపుతున్నారు భర్తలు. అత్తలు మొత్తుతున్నారు కోడండ్రను. యీ బాధలపైన వారికి దృష్టియే లేదు. దేనివల్ల? 'పేపరుపైన ప్రింటుకొట్టినట్టుగా' ఆ హృదయమనే పేపరుపైన కృష్ణుడు ముద్రింపబడ్డాడు. ఈ ప్రింటును, పేపరును వేరు చేయటానికి ఎవరికీ సాధ్యము కాదు. కనుకనే వారికి ధైర్యము, సాహసము, ఆనందము, ఆహ్లాదము ఆలవాలమై వుంటున్నది. ఎవరి హృదయముపైన భగవంతుడు చిత్రింపబడతాడో వారికి ఎట్టి బాధలు వుండవు. ఎట్టి అశాంతి సమీపించదు. ఎట్టి దుఃఖము వారికి అంటదు. నిరంతరము సచ్చిదానందస్వరూపులై వుంటారు.

**హృదయమనే మలిన వస్త్రమును ప్రేమ అనే జలములో ముంచి సాధన అనే సబ్బు రాసి జ్ఞానమనే రాతికి కొట్టాలి**

మనము భగవంతుని నామమును నాలుకపైన నాట్యమాడించటమే కాకుండా హృదయములోపల ప్రవేశింపచేసుకోవాలి. కనుక, భజనలు చెయ్యాలి. యీ భజనయొక్క vibration వల్ల వాతావరణము పరిశుద్ధమైపోతుంది. ఈనాడు శబ్దస్పర్శరూపరసగంధాదులన్నీ మాలిన్యమై వున్నాయి. ఈ కలుషితమైన పంచభూతములను పరిశుద్ధము గావించాలి. యేరీతిగా గావించాలి? మనము ఒక చిన్న ఉదాహరణము తీసుకుందాము. శబ్దమువల్లనే సర్వస్వము సృష్టింపబడుతున్నాది. ఎట్టి మంట లేస్తుందో అట్టి పొగ వస్తుంది. ఎట్టి పొగనో అట్టి మేఘముగా రూపొందుతుంది. ఎట్టి మేఘమో అట్టి వర్షము కురుస్తుంది. ఎట్టి వర్షమో అట్టి పంట పండుతుంది. ఎట్టి పంటనో అట్టి వంట వండుతాము. ఎట్టి వంటనో అట్టి జీవితము మనకు తయారౌతుంది. మనము చేసే శబ్దములన్నీ విద్యుచ్ఛక్తి తరంగములుగా మారిపోతాయి. ఈ తరంగములన్నీ గాలిలో చేరుతున్నాయి. ఈ గాలిని మనము నిత్యము పీల్చుకుంటున్నాము. ఈ విధంగా అశుద్ధమైన, మాలిన్యమైన, కలుషితమైన గాలిని మనం పీల్చుకుంటున్నాము. కనుక, మొట్టమొదట

sri sathyasai vachanamrutam

గాలిని పరిశుద్ధపరచాలి. ఈ గాలిని పరిశుద్ధము చేయాలంటే భగవన్నామాన్ని స్మరించాలి. నగరసంకీర్తన చేస్తుంటారు. దానివలన అనేకత్వములో వుండిన ఏకత్వమైన శబ్దము ఒక దివ్యమైన vibration గా మారిపోతుంది. అట్టి vibration వున్న గాలినే మనం నిత్యము పీల్చుకోవాలి. అప్పుడే మనలో సద్భావములు అభివృద్ధి అవుతాయి. దివ్య భావములు ఆవిర్భవిస్తాయి. అప్పుడే మనకు శాంతి చేకూరుతుంది. త్రాగే నీరు మాలిన్యమై వుంటున్నాది. కనుక, మన జీవితము మాలిన్యము కాక పరిశుద్ధము ఎట్లా అవుతుంది? మొట్టమొదట మన జీవితమును పరిశుద్ధము గావించుకోవాలి. ఈ వస్త్రము తెల్లగా వుంటున్నాది. కానీ యిది వుపయోగించుకోటంవలన దీనిలో మాలిన్యము చేరిపోయింది. మాలిన్యము చేరిన వస్త్రమును మనము యే రీతిగా పరిశుద్ధము చెయ్యాలి? నీటిలో ముంచాలి. సబ్బు రాయాలి. రాతికి వేసి కొట్టాలి. అప్పుడే యీ మాలిన్యము తొలగిపోతుంది. మన హృదయమనే మాలిన్యము కలిగిన యీ వస్త్రాన్ని ప్రేమ అనే జలములో వేసి సాధన అనే సబ్బును వేసి జ్ఞానమనే రాతికి కొట్టాలి. అప్పుడే మనలో వున్న మాలిన్యము దూరమైపోతుంది. అప్పుడే దివ్యమైన భావము మనలో యేర్పడుతుంది. అప్పుడే మానవుడు 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణం' అయిన సత్యతత్వాన్ని అనుభవిస్తాడు.

ప్రేమస్వరూపులారా! ఆధ్యాత్మిక చింతన అందరికి వున్నది. ఆధ్యాత్మిక భావము అందరియందు ఆవిర్భవిస్తున్నాది. కానీ, మార్గము తెలియక తబ్బిబ్బై పోతున్నారు. అందరియందున్న ఆధ్యాత్మిక భావమును సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టండి. సరియైన ఆశను మీరు ఆశించండి. నిత్యా నిత్య విషయ పరిశీలనా శక్తిని సరియైన మార్గములో ప్రవేశపెట్టండి. స్వార్థము, స్వప్రయోజనములను త్యజించండి. భగవన్నామాన్ని ఉచ్చరించండి. అన్ని సమయములందు, అన్ని కాలములందు, అన్ని స్థానములందు, భగవన్నామాన్ని హృదయ పీఠములో ప్రతిష్ఠ చేసుకోండి. ఏరీతిగా ఉచ్చరించాలి, యీ నామమును? ప్రేమతో పలకాలి.

**(తేదీ 28-01-1992న సాయంత్రం ధర్మక్షేత్రంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam